సాక్షి
సిద్దిపేట
శనివారం । 27 । జనవరి । 2024



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్ జే పాటిల్



జాతీయజెండాను ఎగురవేస్తున్న కలెక్టర్ ప్రశాంత్ జే పాటిల్, పక్కన జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, సీపీ అనురాధ

సుపరిపాలన దిశగా..

- అంకితభావంతో సంక్షేమ పథకాల అమలు
- కలెక్టర్ ప్రశాంత్ జే పాటిల్
- అట్టహాసంగా గణతంత్ర వేడుకలు



త్రివర్ణ పతాకంతో, ఝాన్సీ లక్ష్మీభాయి వేషధారణలో విద్యార్థులు

సిద్దిపేటజోన్: అనేక ఉద్యమాలు, పోరాటాల ఫలితంగా ఏర్పడిన రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలను పరిగణలోకి తీసుకుని జిల్లాలో సుపరిపాలన దిశగా అడుగులు వేస్తామని కలెక్టర్ ప్రశాంత్ జే పాటిల్ స్పష్టం చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ఎందరో త్యాగధనుల పోరాట ఫలితంగా దేశానికి స్వాతంత్య్రం వచ్చిందన్నారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం అభయహస్తం ఆరు గ్యారంటీల అమలుకు శ్రీకారం చుట్టిందన్నారు. నేటికీ 33 లక్షల మంది మహిళలు ఆర్టీసీలో ఉచిత ప్రయాణాన్ని వినియోగించుకున్నారని తెలిపారు. పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆరోగ్యశ్రీ సేవలను విస్తరించి రూ.10 లక్షల వరకు ఉచిత వైద్య సాయం అందించేలా భవిష్యత్ ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. జిల్లాలోని 14 ఆస్పత్రుల్లో రాజీవ్ ఆరోగ్యశ్రీ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రజాపాలన ద్వారా జిల్లాలో 3.25 లక్షల దరఖాస్తులు తీసుకున్నామని వివరించారు. ప్రతివర్గాన్ని పరిగణలోకి తీసుకుని సంక్షేమ పథకాలు అమలు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు.

రైతు బాగుంటేనే పల్లె ప్రగతి

రైతు బాగుంటేనే పల్లె ప్రగతి సాధ్యమనే నానుడిని నమ్ముతూ గ్రామాల ఆర్థిక పరిస్థితి మెరుగు కోసం చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు. రైతును బలోపేతం చేసేందుకు అన్నిరకాల చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు పారదర్శకంగా తీసుకెళ్లి జిల్లాను అన్నిరంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు నిరంతరం కృషి చేస్తామని అన్నారు. జిల్లాకు చెందిన రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ, ఉమ్మడి మెదక్ జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహ, జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధుల సహకారం తీసుకొని ఆదర్శంగా పథకాలను పటిష్టంగా అమలు చేయడానికి అంకితభావంతో పనిచేస్తామని పేర్కొన్నారు. అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు.

అమరుల కుటుంబాలకు సత్కారం

గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లాకు చెందిన స్వాతంత్య్ర సమరవీరుల కుటుంబాలను ప్రభుత్వం తరఫున ఘనంగా సన్మానించారు. కలెక్టర్ ప్రశాంత్ జే పాటిల్, జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, పోలీస్ కమిషనర్ అనురాధ వారికి శాలువా కప్పి సత్కరించారు. అనంతరం తెలంగాణ గురుకుల పాఠశాల ఎన్సాన్‌పల్లి విద్యార్థులు, ప్రభుత్వ బాలికల పాఠశాల, రాఘవాపూర్ కేజీబీవీ విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వేడుకల్లో ఆదనపు కలెక్టర్లు గరిమా అగ్రవాల్, శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీఓ రమేష్, తహసీల్దార్ దిలీప్, మున్సిపల్ కమిషనర్ సంపత్, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేట ప్రభుత్వ బాలికల హైస్కూల్ విద్యార్థుల నృత్యం



స్వాతంత్ర్య సమరయోధులను సన్మానిస్తూ..



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రశాంత్ జే పాటిల్

న్యూస్‌రీల్

త్యాగధనుల స్ఫూర్తితో సాగుదాం



జాతీయ జెండాకు వందనం చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేటజోన్: త్యాగధనుల పోరాట స్ఫూర్తితో రాష్ట్రం కోసం అంకితభావంతో ముందుకు సాగుదామని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పిలుపునిచ్చారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ నాయకత్వంలో పదేళ్ల దేశంలోనే రాష్ట్రం రోల్‌మోడల్‌గా నిలిచిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, వైస్ చైర్మన్ కనకరాజు, పట్టణ పార్టీ అధ్యక్షుడు సంపత్, కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు

స్నేహపూర్వక క్రీడలు ముఖ్యం



విజేతలకు కప్ అందజేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి రఘురాం

సిద్దిపేటజోన్: స్నేహపూర్వక క్రీడలు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ రఘురాం అన్నారు. గురువారం రాత్రి స్థానిక స్టేడియంలో జ్యుడీషియల్, పోలీస్‌శాఖల మధ్య నిర్వహించిన ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ రసవత్తరంగా సాగింది. పోటీలో పోలీస్ శాఖ జట్టు విజయం సాధించింది. విజేతలకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి బహుమతులు అందజేసి మాట్లాడారు. విధి నిర్వహణలో ఉండే ఇరుశాఖల వారికి అప్పుడప్పుడు ఇలాంటి మ్యాచ్‌లు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఫస్ట్ అడిషనల్ జిల్లా జడ్జి మురళీమోహన్, జూనియర్ సివిల్ జడ్జి చందన, అడిషినల్ డీసీపీలు శ్రీనివాస‌రావు, మల్లారెడ్డి, రామచంద్రరావు, సుభాష్ చంద్రబోస్, సిద్దిపేట ఏసీపీ సురేందర్‌రెడ్డి, ఎస్ఐలు, న్యాయవాదులు సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సంక్షేమం



పార్టీలో చేరిన వారితో డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి

కొండపాక(గజ్వేల్): వందేళ్ల చరిత్ర కలిగిన కాంగ్రెస్ పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసిందని డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. శుక్రవారం కుకునూరుపల్లి మండలంలోని పలు గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆచరణకు సాధ్యం కానీ హామీలు ఇచ్చి రూ.లక్షల కోట్ల ప్రజాధనాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం దోచుకుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం తప్పకుండా అమలు చేసి తీరుతుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం కోసం కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు విరుపాక శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు రవీందర్, కోల ఉపేందర్, వీరేశం, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలతో ఆర్థిక అభివృద్ధి



మందులు పంపిణీ చేస్తున్న అధికారులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): ప్రభుత్వం అందించే రాయితీ పథకాలతో రైతులు ఆర్థిక అభివృద్ధి సాధించవచ్చని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పశువైద్య కేంద్రంలో గొర్రెల కాపరులకు మందులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలుగు నెలల క్రితం మండల పరిధిలోని దౌలాపూర్‌లో రెండో విడత గొర్రెల పంపిణీలో భాగంగా 12 మంది లబ్ధిదారులకు గొర్రెలను పంపిణీ చేసినట్లు తెలిపారు. జీవాల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి శ్వేత, వీఓ శ్రీనివాస్, హరిప్రసాద్, పాల్గొన్నారు.

అన్ని వసతులతో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ



నీటి ట్యాంక్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు తదితరులు

సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

నంగునూరు(సిద్దిపేట): అత్యాధునిక టెక్నాలజీతో అన్ని వసతులతో కూడిన ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని మన ప్రాంతంలో నిర్మిస్తున్నామని, పనులు త్వరగా పూర్తి చేయాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండల పరిధిలోని నర్మెటలో నిర్మిస్తున్న ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీలో నూనె ఉత్పత్తి చేయడమే కాకుండా రిఫైనరీని పెట్టి ఫైనల్ ప్రొడక్ట్‌ను ఇక్కడి నుంచే నేరుగా మార్కెట్‌లోకి పంపిస్తామని తెలిపారు. అందుకు కావాల్సిన 4 మెగావాట్ల సెల్ఫ్ జనరేషన్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని కూడా ఇక్కడే ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వాడిన నీటిని వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ద్వారా రీ సైకిల్ చేసే పద్ధతిని ఇక్కడే పెట్టామన్నారు. మూడేళ్ల క్రితం ఆయిల్ పామ్ పంటను పెట్టిన రైతులు ఈ జూన్ వరకు పంట దిగుబడి రానుందన్నారు. 5 నెలల్లో పంట ఉత్పత్తి అయితున్నందున దాన్ని కొనుగోలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అనంతరం మండల పరిధిలోని పాలమాకులలో మండలస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆయిల్‌పామ్ ఫార్మర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సామిరెడ్డి, నాయకులు శ్రీకాంత్ రెడ్డి, అజీజ్, బాబు, రాజిరెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ కంటెంట్‌తో మేలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పదో తరగతి విద్యార్థులకు డిజిటల్ కంటెంట్‌తో లబ్ధి చేకూరుతుందని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు డిజిటల్ కంటెంట్‌ను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోనే సిద్దిపేట నియోజకవర్గం అన్నిరంగాల్లో ముందంజలో ఉందన్నారు. నియోజకవర్గంలో 2,516 మంది విద్యార్థులకు డిజిటల్ కంటెంట్‌ను పంపిణీ చేస్తున్నామని.. ఈ రెండు నెలలు మీ వెంటే ఉంటానని తెలిపారు.

డిప్యూటేషన్ ఉత్తర్వులు సస్పెండ్

కొమురవెల్లి ఏఈఓ అంజయ్య రీజాయినింగ్

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో ఏఈఓగా విధులు నిర్వర్తిస్తున్న వైరాగ్యం అంజయ్యపై పలు ఆరోపణలు రావడంతో దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్ ఇటీవల మెదక్ అసిస్టెంట్ కార్యాలయానికి డిప్యూటేషన్‌పై బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వెంటనే ఆలయ ఈఓ బాలాజీ ఏఈఓ అంజయ్యను రిలీవ్ చేశారు. దీంతో ఏఈఓ తన పదవీ విరమణకు 11 నెలల సమయమే ఉందని.. కొందరు కావాలనే అసత్య ఆరోపణలు చేశారని హైకోర్టును ఆశ్రయించారు. దీంతో హైకోర్టు దేవాదాయ శాఖ కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వులు సస్పెండ్ చేసి అతడిని కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో విధులు నిర్వర్తించేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. అలాగే రీజాయినింగ్ చేసుకోవాలని దేవాదాయ శాఖను ఆదేశించడంతో ఏఈఓ శుక్రవారం ఈఓకు జాయినింగ్ ఉత్తర్వులు అందించారు. ఈవిషయమై ఈఓను వివరణ కోరగా ఏఈఓ అంజయ్య రీజాయినింగ్ ఉత్తర్వులు ఇచ్చిన విషయం వాస్తవమేనని.. దేవాదాయశాఖ కమిషనర్‌కు లేఖ రాశామని ఉత్తర్వులు వచ్చిన వెంటనే జాయినింగ్ చేసుకుంటామని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సిద్దిపేట అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ రవీందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పటేల్‌పుర, అంబేద్కర్‌నగర్, సంజీవయ్యనగర్, వేములవాడ కమాన్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, బోయగల్లి, సాజీద్‌పుర, వీవీనగర్, పారుపల్లి, నర్సాపూర్, కరీంగనర్ రోడ్డు, హనుమాన్‌నగర్, దోబీగల్లి, లాల్‌కమాన్, డబుల్ బెడ్రూం కాలనీల్లో శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ ఉండదని.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

సీపీ అనురాధ



సిద్దిపేటకమాన్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ సూచించారు. కమిషనరేట్ పరిధిలో చోటు చేసుకున్న పలు సైబర్ నేరాల వివరాలను శుక్రవారం వెల్లడించారు. సిద్దిపేట టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి సాయ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఆన్‌లైన్‌లో రూ.1,01,400 పెట్టుబడిగా పెట్టాడు. తర్వాత ఆ నంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో మోసం జరిగినట్లు గుర్తించాడు. మిరుదొడ్డి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి మీ స్థలంలో వొడాఫోన్ సెల్ టవర్ వేస్తామని, అందుకు గానూ అగ్రిమెంట్ పేపర్లు వాట్సాప్‌లో పంపి డబ్బులు పంపాలని సూచించారు. బాధితుడు రూ. 22,150 పంపించగా.. మరిన్ని డబ్బులు పంపాలని కోరాడు. అనుమానం వచ్చిన బాధితుడు జాతీయ హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేశాడు. రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి రీఛార్జి చేస్తే బోనస్ డబ్బులు వస్తాయని చెప్పిన మాటలు నమ్మిన బాధితుడు పలు దఫాలుగా ఆన్‌లైన్‌లో రూ.74 వేలు పంపించి మోసపోయాడని తెలిపారు.

నష్టాల నుంచి లాభాల్లోకి!

హుస్నాబాద్ డిపోకు మంచి రోజులు

- మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంతో పెరిగిన రద్దీ
- రోజూ సరాసరి 30 వేల మంది ప్రయాణం
- మరో 12 కొత్త బస్సులకు ప్రతిపాదనలు



హుస్నాబాద్ ఆర్టీసీ డిపో

హుస్నాబాద్: నష్టాల ఊబిలో కొట్టుమిట్టాడుతున్న హుస్నాబాద్ ఆర్టీసీ డిపో కొత్త బస్సులతో జవసత్వాలు నింపుకుంది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆదరణ పెరుగుతోంది. మరోవైపు బస్టాండ్ ప్రయాణికులతో కళకళలాడుతోంది. హుస్నాబాద్ ఆర్టీసీ డిపోలో 212 మంది ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. డిపోలో మొత్తం 55 బస్సులు ఉండగా.. ఇందులో రెండు సూపర్ లగ్జరీ, 9 ఎక్స్‌ప్రెస్, 6 మినీ బస్సులు, మిగితావి పల్లె వెలుగు బస్సులు నడుస్తున్నాయి. ప్రతి రోజు 27 రూట్లల్లో 20,500 కి.మీ వరకు బస్సులు నడుపుతున్నారు. ముఖ్యంగా జనగామ, కరీంనగర్, హుజూరాబాద్, హైదరాబాద్ రూట్లలో డిపోకు కలెక్షన్ అధికంగా వస్తోంది. గతంలో దాదాపు 17 వేల మంది ప్రయాణం చేస్తే, ప్రస్తుతం 30 వేలకు పైగా ప్రయాణికులు బస్సుల్లో ప్రయాణం చేస్తున్నారు.

మంత్రి పైనే గంపెడాశలు

ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ రాష్ట్ర రవాణాశాఖ మంత్రి కావడంతో ఆయనపై ఈ ప్రాంత ప్రజలు గంపెడాశలు పెట్టుకున్నారు. ప్రస్తుతం చాలా గ్రామాలకు రోడ్డు సౌకర్యం ఉన్న బస్సు సౌకర్యం లేదు. మంత్రి రాకతో బస్సుల సంఖ్య పెంచడమే కాకుండా అన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం కలుగుతుందని ఆశాభాశం వ్యక్తం చేస్తున్నారు. నెల రోజులకే మూడు కొత్త ఎక్స్‌ప్రెస్ బస్సులను హుస్నాబాద్ డిపోకు కేటాయించి ప్రారంభించారు.

అధికారుల సందర్శన

దాదాపు 30 ఏళ్ల క్రితం ఏర్పడిన హుస్నాబాద్ బస్టాండ్ ఆధునీకరణ కోసం అధికారులు కసరత్తు చేస్తున్నారు. బస్టాండ్‌లో టాయిలెట్ల సంఖ్యను పెంచడంతో పాటు రెనివేషన్ చేయాలని ఇంజనీరింగ్ అధికారులు నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఫ్లాట్ ఫాంల సంఖ్యను పెంచే యోచనలో ఉన్నారు. ప్రస్తుతం అవుట్ సోర్సింగ్ పద్ధతిలో ఉద్యోగుల నియామకం చేపట్టనున్నట్లు సమాచారం. బస్ డిపో ఆవరణలో పెట్రోల్ బంక్ ఏర్పాటు కోసం ఇప్పటికే హెచ్‌పీ కంపెనీ నిర్వాహకులు స్థల పరిశీలన చేశారు. త్వరలోనే పెట్రోల్ బంక్ ఏర్పాటు చేసే అవకాశం ఉంది.

ప్రతిపాదనలు పంపించాం



డిపోకు మరికొన్ని కొత్త బస్సులు వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే మూడు కొత్త ఎక్స్‌ప్రెస్ బస్సులు వచ్చాయి. డిపోకు ఇంకా ఎన్ని బస్సులు అవసరమో నివేదిక ఇవ్వాలని ఉన్నతాధికారులు ఆదేశించగా 12 కొత్త బస్సుల కోసం ప్రతిపాదనలు పంపించాం. రోజు రోజుకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య పెరుగుతుంది. కొత్త బస్సులు వస్తే అన్ని గ్రామాలు, లాంగ్ రూట్లకు బస్సు సౌకర్యం కలుగుతుంది.

– వెంకటేశ్వర్లు, డిపో మేనేజర్, హుస్నాబాద్

క్లుప్తంగా

సమ్మక్క, సారలమ్మ జాతర పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జాతర నిర్వాహకులు

మద్దూరు(హుస్నాబాద్): దూళ్మిట్ట మండలంలోని కూటిగల్ గ్రామంలో ఫిబ్రవరిలో జరిగే సమ్మక్క, సారలమ్మ జాతర పోస్టర్‌ను జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని నిర్వాహకులను సూచించారు.

దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనకు జిల్లా ప్రాజెక్టులు



ప్రాజెక్ట్‌లతో సుష్మ



రితేష్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/మర్కూక్(గజ్వేల్): దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనకు జిల్లా నుంచి రెండు ప్రాజెక్టులు ఎంపికయ్యాయని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్‌లు శుక్రవారం తెలిపారు. జిల్లా నుంచి రాష్ట్ర స్థాయికి 10 ప్రాజెక్టులు ఎంపికవ్వగా అందులో రెండు ప్రాజెక్టులు దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికయ్యాయన్నారు. మర్కూక్ మండల పరిధిలోని జెడ్పీహెచ్ఎస్ దామరకుంటలో 9 తరగతి చదువుతున్న విద్యార్థిని సుష్మ, సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని స్ప్రింగ్ డల్స్ పాఠశాలలో చదువుతున్న రితేష్‌ల ప్రాజెక్టులు ఎంపికయ్యాయన్నారు. ఈ ప్రాజెక్టులు దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనలో రాణిస్తే, జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపిక అవుతారని తెలిపారు. విద్యార్థులను గైడ్ టీచర్లు బ్రహ్మయ్య, కృష్ణకుమార్‌లను అభినందించారు.

బాల నేరస్తులకు న్యాయ సహాయం



మాట్లాడుతున్న న్యాయమూర్తి స్వాతిరెడ్డి

సిద్దిపేటకమాన్: నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ స్వాతి రెడ్డి లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులతో శుక్రవారం సిద్దిపేట కోర్టులో సమావేశం నిర్వహించారు. జైలులో ఉన్న బాల నేరస్తులను గుర్తించడం, వారికి న్యాయ సహాయం అందించడం అనే అంశాలపై చర్చించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జైలులో ఉన్న 18 నుంచి 22 ఏళ్ల వయసు ఉన్న ఖైదీలను గుర్తించి న్యాయ సహాయం అందిస్తామని పేర్కొన్నారు. పాన్ ఇండియా ప్రచారంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

మద్యం మత్తులో ఆత్మహత్య

వెల్దుర్తి(తూప్రాన్): మద్యం మత్తులో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన వెల్దుర్తి పంచాయతీ పరిధి ఎల్కపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు కానికె వెంకటేష్(45) శుక్రవారం ఉదయం లేవలేదు. ఇంటి తలుపులు మూసి ఉండడాన్ని గమనించి చుట్టుపక్కల వారు వచ్చి చూడగా ఉరేసుకొని కనిపించాడు. తాగుడుకు బానిసై మద్యం మత్తులో వెంకటేష్ ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ మధుసూదన్‌గౌడ్ వెల్లడించారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్. మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సప్ చేయగలరు. 91777 36926. [M-1233757]

■ Hydలో పనిచేయుటకు సెంగార్డ్స్, సెంటూపర్ వైజర్స్ లేడీ గార్డ్స్, ఫీల్డ్ ఆఫీసర్స్, కావలెను. ఏరియా: బాలానగర్, మియాపూర్, జీడిమెట్ల, గండిమైసమ్మ కొల్లారు రూం ఫ్రీ మెట్రోమేనేజిమెంట్ ఫోన్: 9963077722/ 9885657755 [H-801465]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ /నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K. ఫోన్: 9160900024/ 9640400073 [H-793681]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఉత్తములు వీరే..

సంగారెడ్డి, మెదక్ జిల్లాలోని పలువురు ఉన్నతాధికారులు, అధికారులు, పోలీసుల సేవలకు అవార్డులు వరించాయి. విధి నిర్వహణలో ప్రతిభ, సమయస్ఫూర్తిని ప్రదర్శించినందుకు ఉత్తమ సేవా వార్డులకు ఎంపికయ్యారు. శుక్రవారం గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని ఆయా జిల్లాల కలెక్టరేట్‌లలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి, మెదక్ కలెక్టర్ రాజర్షిషా చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్నారు.

-సాక్షి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి



(కుడి నుంచి ఎడమకు)

సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి చేతుల మీదుగా పత్రాలు అందుకుంటున్న చంద్రశేఖర్, మాధురి, రూపేష్, నగేశ్, శ్రీనివాస్, ఎల్లయ్య, రవీందర్, సురేశ్ మోహన్, జగదీష్, వనజాత, సుగుణ భాయ్, పరమేశం, దశరథ్, నాగేశ్వరరావు, ఫర్వీన్ షేక్, విజయలక్ష్మీ, కార్తీక్



కిరణ్ కుమార్, అరుణోదయ చారి, నందకిషోర్, కార్తీక్ , ప్రవీణ్ రెడ్డి, రాహుల్, అరుణ్, పాషా , మహేందర్, సాయి, మల్లప్ప, మల్లేష్, ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, ఖదీర్, సుభాష్, సలాం, సాయిలు, (కుడి నుంచి ఎడమకు)



సుభాష్, నారాయణ, వెంకటేశ్వర రెడ్డి, జయంతి, డాక్టర్ అశోక్, సుజాత, ఉదయ్ కుమార్, విజయలక్ష్మి, అనీల్ కుమార్, శ్రీధర్, ప్రదీప్, రవీందర్, అంజయ్య, సమద్, రామాచారి, కృష్ణ (కుడి నుంచి ఎడమకు)



మెదక్ కలెక్టర్ రాజర్షి షా చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న మెదక్ డీఎస్పీ ఫణీంద్ర, వసురాం, నరేందర్ రెడ్డి, ఉమాదేవి, హన్మంత్, సందీప్, రామయ్య, ప్రభాకర్‌రెడ్డి, రవీందర్

ప్రతీ ఆలోచన వెనుక ఓ సైన్స్

- ప్రజల్లో గొప్ప చైతన్యానికి నాంది
- అందరూ శాఖాహారులుగా మారాలి
- సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు



శాఖాహారుల ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హరీశ్ రావు

సిద్దిపేటజోన్: ప్రతీ ఆలోచన వెనుక ఓ సైన్స్ ఉంటుందని, అలాగే శాఖాహారం వెనుకా సైన్స్ ఉందని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం కొండ మల్లయ్య గార్డెన్స్‌లో శాఖాహారుల మెగా ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. అంతకుముందు ర్యాలీని ఉద్దేశించి మాట్లాడారు. ప్రస్తుతం సమాజంలో ఒక్క శాతం మాత్రమే శాఖాహారులు ఉన్నారని, మిగతా అంత కూడా మాంసాహారులని పేర్కొన్నారు. శాఖారుల సంఖ్య పెరగాలని ఈ కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమన్నారు. అనంతరం పట్టణ వీధుల గుండా భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సంపత్ రెడ్డి, ప్రతినిధులు పాండు, రవి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు క్యాంపు కార్యాలయంలో అయోధ్య ప్రత్యేక అతిథిగా వెళ్లి వచ్చిన వైద్యులు అరవింద్ ఎమ్మెల్యే హరీశ్ రావును మర్యాదపూర్వకంగా కలిశారు.

రైతులకు అవగాహన కల్పించాలి

నియోజకవర్గ పరిధిలోని రైతులను గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో కలిసి అధికారులు వ్యవసాయ సాగు సూచనలు చేసి మరింత అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే హరీశ్ రావు సూచించారు. క్యాంపు కార్యాలయం నుంచి నియోజకవర్గ పరిధిలోని వ్యవసాయ శాఖ అధికారులతో శుక్రవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలో ప్రధాన పంట వరి వల్ల ప్రతీ సంవత్సరం పంట మార్పిడి లేక మొగి పురుగు ఉధృతి పెరుగుతుందని పేర్కొన్నారు. దీనిపై రైతులను చైతన్యం చేయాలని సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల సాగునీరు పెరిగి యాసంగి లో వరికి రైతులు మక్కువ చూపుతున్నారని పేర్కొన్నారు.

ఇంటింటా ఇన్నోవేటర్ విలేజ్ అవార్డులు



అనిల్‌కుమార్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు



విద్యార్థిని సన్మానిస్తున్న సర్పంచ్ సంజీవరెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): ఇంటింటా ఇన్నోవేటర్ విలేజ్ ఇన్నోవేషన్ అవార్డ్–2024 విన్నర్ శామంతుల అనిల్‌కుమార్‌ను ఘనంగా సన్మానించారు. శుక్రవారం రాష్ట్రప్రభుత్వం 20 జిల్లాల్లోని 44 మంది ఇన్నోవేటర్స్ విజేతలను ప్రకటించింది. ఇందులో మద్దూరు మండల పరిధిలోని నర్సాయిపల్లి గ్రామానికి చెందిన శామంతుల అనిల్‌కుమార్ ఉన్నారు. గ్రామ సర్పంచ్ బద్దిపడగ లలితా కృష్టారెడ్డి, గ్రామ కార్యదర్శి భాస్కర్ అనీల్‌కుమార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు రజిత, రేణుక అంగన్‌వాడీ టీచర్ సునీత, సీఏలు రేణుక, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

పాపన్నపేట(మెదక్): ఇంటింటా ఇన్నోవేటర్ విలేజ్ ఇన్నోవేషన్ అవార్డును నాగ్సాన్‌పల్లి ఉన్నత పాఠశాల విద్యార్థి విగ్నేష్ గెలుపొందారు. ఈ సందర్భంగా శుక్రవారం సర్పంచ్ సంజీవరెడ్డి విద్యార్థిని సన్మానించారు. అతడితోపాటు అడ్జస్టబుల్ వాలీబాల్ నెట్ ఆవిష్కరణ చేసి జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన అదే పాఠశాల విద్యార్థి ఆదిత్య వర్ధన్‌ను సన్మానించారు.

సైన్స్ ఫెయిర్‌లో ఆకట్టుకున్న సచివాలయ నమూనా



సచివాలయ నమూనాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని హీరా ఫౌండేషన్ స్కూల్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌ను ఎమ్మెల్యే మాణిక్‌రావు ప్రారంభించారు. విద్యార్థులు తయారు చేసి ప్రదర్శించిన నమూనాలను తిలకించారు. విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంచేందుకు విజ్ఞాన ప్రదర్శనలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. విద్యార్థులు తయారు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ సచివాలయ నమూనా ఎమ్మెల్యేను ఆకట్టుకుంది. అనంతరం ఉత్తమ నమూనాలకు బహుమతులను ప్రధానం చేశారు.

అక్రమ ఇసుక రవాణా

ఐదు వాహనాలను పట్టుకున్న పోలీసులు

సిద్దిపేటకమాన్: అక్రమంగా ఇసుక రవాణ చేస్తున్న ఐదు వాహనాలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ సీఐలు రమేశ్, నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపూర్ చౌరస్తా కుంకుమ మిల్లు వద్ద లారీ, మినీ టిప్పర్, బొలేరో వాహనంలో, చిన్నకోడూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రెండు లారీల్లో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి వెళ్లి పట్టుకున్నామన్నారు. వాహనాలను సంబంధిత పోలీసు స్టేషన్‌కు అప్పగించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమ ఇసుక రవాణా, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా చేస్తే చట్టప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఏదైనా సమాచారం ఉంటే సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ కంట్రోల్ రూం 87126 67100, టాస్క్‌ఫోర్స్ అధికారులు 87126 67447కు సమాచారం అందించాలని సూచించారు.

చిన్నారుల్లో మేధాశక్తి పెరుగుతుంది



చిన్నారికి డ్రాప్స్ వేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి

నారాయణఖేడ్: ఆయుర్వేద మందు చిన్నారుల్లో మేధాశక్తి పెరగడానికి దోహదపడుతుందని లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. నారాయణఖేడ్ కల్వనా ఆంజనేయస్వామి ఆలయం ఆవరణలో శుక్రవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో చిన్నారులకు స్వర్ణామృత ప్రాశన ఆయుర్వేద మందు వేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హాజరై చిన్నారులకు డ్రాప్స్ వేశారు. కార్యక్రమంలో క్లబ్ జోనల్ చైర్మన్ రాజ్‌కుమార్, బాధ్యులు సాయికుమార్, వెంకట్‌రావు, పండరిరెడ్డి, వినోద్ పాటిల్, జైపాల్‌రెడ్డి, మన్మథ కిషోర్, ప్రసన్నకుమార్, జ్ఞానేశ్వర్‌గౌడ్, అనిల్‌గౌడ్, నర్సింహులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం సద్వినియోగం చేసుకోండి

నారాయణఖేడ్‌లో ఈనెల 30న ఉదయం 10గంటల నుంచి పట్లోళ్ల కిష్టారెడ్డి ట్రస్ట్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ హోలిస్టిక్ ఆస్పత్రి సౌజన్యంతో నిర్వహించనున్న ఉచిత గుండె, సాధారణ వైద్య శిబిరాన్ని ఖేడ్ నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి కోరారు. ఆయన స్వగృహం ఆవరణలో శిబిరానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు రమేశ్ చౌహాన్, శంకర్ ముదిరాజ్, దీపక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హత్యా.. ఆత్మహత్యా?

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



ఘటనా స్థలంలో వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ విజయ్‌కుమార్

ములుగు(గజ్వేల్): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన ములుగు మండలం బహిలంపూర్ ఆర్అండ్ఆర్ కాలనీలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు మండలం బహిలంపూర్ ఆర్అండ్ఆర్ కాలనీకి చెందిన గువ్వ నరేశ్(30)కు తొమ్మిదేళ్ల కిందట క్షీరసాగర్‌కు చెందిన లతతో వివాహమైంది. వీరికి తొమ్మిదేళ్ల లోపు అక్షయ, లిపిత్, వంశీ ఉన్నారు. నరేశ్ సమీప పరిశ్రమలో కార్మికుడు కాగా, భార్య దినసరి కూలీ. సంసారం విషయంలో దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. గురువారం రాత్రి 11 గంటల ప్రాంతంలో నరేశ్ ఇంట్లోనే అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. అదే రాత్రి మృతుడి భార్య లత సమీపంలోని మామ మల్లేశ్ ఇంటికి వెళ్లి భర్త నరేశ్ ఉరి వేసుకొని చనిపోయాడని తెలిపింది. అతడు వచ్చి చూడగా బెడ్‌రూం పైన సీలింగ్ కొక్కానికి చీర వేలాడుతూ కనిపించగా, నరేశ్ కింద అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. గదిలో బట్టలన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. నరేశ్ మృతిపై తండ్రి మల్లేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఘటనా స్థలాన్ని పరిశీలించి అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. తనంతట తానే ఉరేసుకున్నాడా లేదా మరెవరైనా హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారా అని అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.



నరేశ్ (ఫైల్)

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



స్వామి (ఫైల్)

మిరుదొడ్డి(దుబ్బాక): అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని మోతెలో శుక్రవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, భూంపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గోత్రాల స్వామి (39) కూలీ పనులు చేసుకుంటూ భార్య రేణుక, పదేళ్లలోపు ఇద్దరు కుమారులను పోషించుకుంటున్నాడు. ఏడేళ్ల క్రితం సుమారు రూ.10 లక్షల వరకు అప్పు చేసి ఇంటిని నిర్మించుకున్నాడు. అప్పులు ఎక్కువై రెండేళ్ల క్రితం బతుకు దెరువు కోసం మస్కట్‌కు వలస వెళ్లాడు. అక్కడా సరైన పని దొరక్క 15 రోజుల క్రితం స్వగ్రామమైన మోతెకు తిరిగి వచ్చాడు. అప్పుల వారి నుంచి ఒత్తిడి రావడంతో ఇంట్లో గొడవలు చోటు చేసుకున్నాయి. దీంతో భార్య రేణుక పుట్టినిల్లు హుజూరాబాద్ మండలం తోకలపల్లికి వెళ్లింది. అప్పులు తీర్చే మార్గం లేక తీవ్ర మనస్తాపానికి గురైన స్వామి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు చేసుకున్నాడు. మృతుడి భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు భూంపల్లి ఎస్ఐ భువనేశ్వర్‌రావు తెలిపారు.

నీటి కెనాల్‌లో పడి కార్మికుడు మృతి



ఘటనా స్థలంలో ఖదీర్ మృతదేహం

సంగారెడ్డి టౌన్: ప్రమాదవశాత్తు నీటి కెనాల్‌లో పడి కార్మికుడు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఫసల్ వాది గ్రామానికి చెందిన ఖదీర్ (36) గణపతి చక్కెర పరిశ్రమలో కాంట్రాక్టు ఉద్యోగిగా పని చేస్తున్నాడు. పరిశ్రమ ఆవరణలో ఉన్న నీటి కెనాల్ లో శుక్రవారం ఉదయం ప్రమాదవశాత్తు కాలుజారి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు పిలల్లు ఉన్నారు. పరిశ్రమ నిర్వాహకుల నిర్లక్ష్యంతోనే మృతి చెందాడని కుటుంబ సభ్యులు ఆరోపిస్తూ ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పించి ఆర్థికంగా ఆదుకుంటామని పరిశ్రమ యాజమాన్యం హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఘటనా స్థలంలో డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, సంగారెడ్డి రూరల్ సీఐ సుధీర్ కుమార్, ఎస్సై రాజేశ్ నాయక్ యాజమాన్యం ఉన్నారు.

ఆటోను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

అక్కడికక్కడే ఆటో డ్రైవర్ మృతి

పటాన్‌చెరుటౌన్: ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ఘటనలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రవీందర్ రెడ్డి కథనం ప్రకారం.. భానుర్‌కి చెందిన అంజిరెడ్డి(39) బీడీఎల్ పరిశ్రమలో కాంట్రాక్ట్ కార్మికులుగా పని చేస్తుంటూ ఖాళీ సమయంలో ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం రాత్రి అంజిరెడ్డి ఆటో తీసుకొని శంకర్‌పల్లి వైపు నుంచి పటాన్‌చెరు వైపు వస్తున్నాడు. బీడీఎల్ పరిశ్రమ సమీపంలోకి రాగానే ఆటో యూటర్న్ చేస్తుండగా పటాన్‌చెరు నుంచి శంకర్‌పల్లి వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో పూర్తిగా అంజిరెడ్డి పై పడడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి భార్య చంద్రకళ శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.